క్లుప్తంగా

బ్రిటన్ ప్రజల తీర్పు ఇతర దేశాలపై ప్రభావం



లక్ష్మీపురం: బ్రిటన్‌లో 14 ఏళ్లుగా అధికారంలో ఉంటున్న కన్సర్వేటివ్ పార్టీ ఓడిపోయి లేబర్ పార్టీ అధికారంలోకి ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తిందని విద్యావేత్త, విశ్లేషకులు ఆర్.వి. సింగరయ్య అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన చర్చా గోష్టిలో ఆయన పాల్గొని, మాట్లాడారు. 650 మంది సభ్యులు ఉండే బ్రిటన్ దిగువ సభలో లేబర్ పార్టీ 412 స్థానాలు సంపాదించిందన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ముప్పాళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం అశాంతితో కునారిల్లుతున్న బ్రిటన్ పౌరులు తమ నిర్ణయాన్ని స్పష్టంగా కఠినంగా చెప్పారన్నారు. అనంతరం పలువురు మేధావులు, విశ్లేషకులు చర్చలో పాల్గొని మాట్లాడారు.

అంతర్జాతీయ నటుడు కమల్ హాసన్



నగరంపాలెం: కమల్ హాసన్ అంతర్జాతీయ నటుడని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. ఈ నెల 12న భారతీయుడు-2 చిత్రం విడుదల సందర్భంగా సురేష్ ఫిలింస్ ఆధ్వర్యంలో బుధవారం నాజ్ కూడలిలోని నాజ్ థియేటర్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజానికి అవసరమైన సందేశాత్మక సినిమాలు చేయడంలో నటుడు కమల్ హాసన్ తన విలక్షణత ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. సెన్సార్ బోర్డు మాజీ సభ్యులు వెచ్చా కృష్ణమూర్తి మాట్లాడుతూ వినూత్న సందేశాత్మక చిత్రం భారతీయుడు-2 అని అన్నారు. భారతీయుడు-2 చిత్ర విశేషాలను సురేష్ ఫిలింస్ జిల్లా మేనేజర్ మాదల రత్తయ్య చౌదరి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ నటి శోభారాణి, నాజ్ థియేటర్ అధినేత లియాఖత్ అలీ, చిత్ర పంపిణీదారులు పాల్గొన్నారు.

మురుగు పారుదల జరిగేలా చూడండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలోని ప్రధాన కాల్వల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపం సమీపంలోని కాల్వల్లో బుధవారం జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. మురుగు పారుదల జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. వర్షపు నీరు కూడా రోడ్లపై ఉండకుండా మురుగు కాల్వల ద్వారా బయటకు పోయే విధంగా చూడాలని తెలిపారు. అనంతరం ఆరో వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఆయన వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, ఏసీపీ సుబ్బారావు, డీఈ సుబ్బారావు, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌కు సన్మానం

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ డిపో పరిధిలోని బస్సుల రాకపోకల వివరాలు, డిపో పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ఇన్‌స్టాగమ్ ద్వారా ప్రచారం చేస్తున్న కండక్టర్ పరుచూరి సుధాకర్‌ను బుధవారం డిపో ఆవరణలో సన్మానించారు. అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ తెనాలి బస్టాండ్‌లో జరుగుతున్న కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తూ ఆర్టీసీ పట్ల సదాభిప్రాయం కలిగే విధంగా కృషి చేస్తున్న సుధాకర్‌ను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అభినందించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా తాము కూడా ఉద్యోగులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

తెనాలిరూరల్: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెనాలి మండలం గుడివాడ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల అందించిన వివరాలు.. గ్రామానికి చెందిన తుమ్మల రవికుమార్(27)కు మూడేళ్ల క్రితం వివాహమైంది. మనస్పర్ధల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రావడంలేదు. మనస్తాపానికి గురైన భర్త బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

వైద్యుల సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచ్ కొద్దీ రోజుల వ్యవధిలోనే ఐదుగురు వైద్యుల్ని కోల్పోవటం దురదృష్టకరమని ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని జీఎంఎం హాల్లో ఐఎంఏ గుంటూరు బ్రాంచ్ సభ్యులు.. ఇటీవల మరణించిన ఐదుగురు వైద్యుల సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు డాక్టర్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించి, ప్రసంగించారు. వైద్యులు ఐదుగురు డాక్టర్ మోటూరి సత్యనారాయణ, డాక్టర్ పి.భగవనారాయణ, డాక్టర్ డి.వెంకట్రామయ్య, డాక్టర్ వి.సంతోష్ కుమార్ , డాక్టర్ పి.నందు సింగ్ ప్రజలకు అందించిన వైద్య, సామాజిక సేవలను మరవలేమన్నారు. వారి కుటుంబ సభ్యులు ఈ దురదృష్టకర విచార ఘటన నుంచి త్వరగా బయటపడాలని ఆకాంక్షించారు. సభలో పాల్గొన్న ఐఎంఏ గుంటూరు శాఖ కార్యదర్శి డాక్టర్ భూసిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మరణించిన వైద్యులందరూ తమ దగ్గరికి వచ్చిన రోగులలో జబ్బులను చూశారు తప్ప.. డబ్బును చూడలేదని స్పష్టం చేశారు. సంతాప సభలో డాక్టర్ బదిరి నారాయణ, డాక్టర్ పద్మావతి దేవి, డాక్టర్ శనక్కాయల అరుణ, డాక్టర్ మమత రాయపాటి, డాక్టర్ ఎం.ఫణికుమార్, డాక్టర్ కె.సురేష్ కుమార్ , డాక్టర్ బి.వెంకటేశ్వరరావు తదితరులు మృతుల కుటుంబాలతో గల అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. తొలుత ఐదుగురు వైద్యుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. సంతాప సభలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ శాఖ ఎలెక్ట్ అధ్యక్షుడు డాక్టర్ జి. నందకిషోర్, గుంటూరు శాఖ ఉపాధ్యక్షుడు డాక్టర్ వెలగా మహేష్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ బి.సాయికష్ణ, సీనియర్ వైద్యులు, ఐఎంఎస్ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలల సమస్యలు పరిష్కరించండి

డెప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మికి ఎస్ఎఫ్ఐ నేతల వినతి



డెప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మితో ఎస్ఎఫ్ఐ నాయకులు

లక్ష్మీపురం: ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్.సమీర్, విద్యార్థినుల కన్వీనర్ సుచరిత డిమాండ్ చేశారు. గుంటూరు నగరంలోని చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య మున్సిపల్ స్కూల్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సర్వే సమయంలో డెప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి తనిఖీకి రావడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాల సమస్యలను ఆమెతో చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు కొన్ని అందరికీ పూర్తి స్థాయిలో అందని పరిస్థితి ఉందన్నారు. ప్రధానంగా మురుగుదొడ్లు సక్రమంగా లేవని, ఉన్న మరుగు దొడ్లు కూడా పరిశుభ్రంగా లేవని తెలిపారు. విద్యార్థులకు బూట్లు, బెల్టులు, బ్యాగులు పూర్తిస్థాయిలో అందలేదన్నారు. పాఠశాలల్లో ఎస్‌జీటీలను నియమించాలని కోరారు. అధిక హాజరు ఉన్న పాఠశాలల్లో ఆట స్థలాలు, వస్తువులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నీరు శుభ్రంగా లేకపోవడం వల్ల విద్యార్థులు బయటకు వెళ్లి కొని నీరు తాగాల్సి పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మితో మాట్లాడి మధ్యాహ్న భోజనం విద్యార్థులతో కలిసి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకుల యశ్వంత్, సిటీ విద్యార్థినుల కన్వీనర్ ఆరిఫా పాల్గొన్నారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న లక్ష్మీపతి, ప్రకాష్


గుంటూరు మెడికల్: బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో 40 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు సమితి అధ్యక్షుడు ఆర్.లక్ష్మీపతి అన్నారు. స్థానిక బ్రాడీ పేటలో ఉన్న బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో బుధవారం పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేసేందుకు కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉపకార వేతనాలు 2024- 25 సంవత్సరానికి కాలేజీలో చదువుతున్న వారికి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన బ్రాహ్మణ విద్యార్థులు బ్రాడీ పేటలోని తమ కార్యాలయానికి వచ్చి అప్లికేషన్ పొందవచ్చని వెల్లడించారు. సేవా సమితి కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్ మాట్లాడుతూ కాలేజీలో చదువుతున్న ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, సీఐ తదితర కోర్సులు చేస్తున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు ఆగస్టు 17వ వరకు సేవా సమితి కార్యాలయంలో అందజేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 25వ తేదీ వరకు దరఖాస్తులు పరిశీలన చేస్తామని వెల్లడించారు. సెప్టెంబర్ 1న ఉపకార వేతనాలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపకార వేతనాల చైర్మన్ జీవీఎల్ఎన్ సంజీవరావు, కోశాధికారి కర్లపాలెం బాలకృష్ణ, సభ్యులు నందిరాజు పాండు రంగారావు, ఎం.రామ్ గోపాల్ ఎ.మంగాదేవి పాల్గొన్నారు. వివరములకు ఉపకార వేతనాలు కమిటీ చైర్మన్ ఎ. సంజీవ్ రావు 94416 55888 నంబరుకు సంప్రదించవచ్చని కార్యదర్శి తెలియజేశారు.

జీఓ నంబర్లు 107, 108లను రద్దు చేయాలి

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం 107 , 108 జీవోల వల్ల కష్టపడి చదువుకునే మెరిట్ విద్యార్థుల జీవితాలను నాశనం చేసిందని డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు విమర్శించారు. గుంటూరు పట్టణం బ్రాడీపేటలోని హోటల్ గ్రాండ్ నాగార్జునలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గతంలో ఇదే సమస్యపై పోరాడిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు అధికారంలోకి వచ్చింది కాబట్టి తన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. సమస్యను పరిష్కరించి, వైద్య విద్యార్థులకు న్యాయం చేసేలా ఆ జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నవ్యాంధ్ర ఇంటలెక్చువల్ సభ్యులు డీఏఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన ఆ రెండు జీవోల కారణంగా మన రాష్ట్ర వైద్య విద్యార్థులకు వైద్య సీట్లు తగ్గిపోవడమే కాకుండా రిజర్వేషన్ విద్యార్థులకి అన్యాయం జరుగుతుందన్నారు. నీట్ 107 ,108 జీవోల పై హైకోర్టులో వాదనలు వినిపిస్తున్న న్యాయవాది ఠాగూర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా ఆ జీవోలను రద్దు చేసిన కాపీలతో సహా సమర్పించడం ద్వారా ఆ కేసుకి న్యాయం చేయటమే కాకుండా వైద్య విద్యార్థులకు ఎంతో మేలు చేసినట్లవుతుందన్నారు.

ప్రజా నిధులతో నిర్మించిన ప్రభుత్వం మెడికల్ కాలేజీలలో వైద్య విద్య వ్యాపారం జరగకుండా నిరోధించి, ఇకపై వైద్య సీట్లు అన్నిటిని మెరిట్ విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.సేవా కుమార్, డాక్టర్ చంద్రకుమార్, శేషు కుమార్, భాష్యం కాలేజీ ప్రిన్సిపల్ హరిబాబు, డాక్టర్ నరసింహారావు పాల్గొన్నారు.

బొమ్మిడాల ఆశయం మహోన్నతమైంది..



కేక్ కట్ చేసిన బొమ్మిడాల భానుమూర్తి

నగరంపాలెం: స్థానిక రింగ్ రోడ్డులోని ఐటీసీ వెలకమ్ హోటల్‌లో బీబీఎం బొమ్మిడాల గ్రూప్ చైర్మన్ బొమ్మిడాల భానుమూర్తి 93వ జన్మదినోత్సవాలను బుధవారం నిర్వహించారు. తొలుత రక్తదాన శిబిరాన్ని డైరెక్టర్‌లు బొమ్మిడాల శ్రీమన్నారాయణ, బొమ్మిడాల కోటిరత్నం, బొమ్మిడాల రాజావరప్రసాద్ ప్రారంభించారు. సామాజిక సేవలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ప్రతిభ కనబరిచిన 26 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ కృషి, పట్టుదల విజయానికి సోపానాలు అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేక నైపుణ్యాలు, ప్రతిభ దాగి ఉంటుందని చెప్పారు. అటువంటి ప్రతిభను గుర్తించిన బొమ్మిడాల గ్రూప్ ఆశయం మహోన్నతమైనదని అభినందించారు. బొమ్మిడాల భానుమూర్తిని స్ఫూర్తిగా తీసుకుని, జీవితంలో పైకి ఎదగాలన్నారు. ఉద్యోగం, వ్యాపారాల్లో ఉన్న సమాజానికి తిరిగి ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. సంస్థలో సుదీర్ఘంగా నిజాయితీ, నిబద్ధత, ప్రతిభ కనబరిచిన 21 మంది ఉద్యోగులకు అవార్డులను సంస్థ అధినేత బొమ్మిడాల భానుమూర్తి ప్రదానం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, డైరక్టర్‌లు, ఉద్యోగ సిబ్బంది కలిసి భానుమూర్తితో కేక్ కట్ చేయించారు.

దళిత ఉద్యమ నేత ఏసురత్నం జయంతి

తెనాలి: దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం జయంతిని బుధవారం స్థానిక అంబేడ్కర్ సేవా ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ దళిత ఉద్యమనేత ఏసురత్నం, దేశవిదేశాల్లో దళితవాణిని వినిపించి, అనేక ప్రతిఘటన పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలకనుగుణంగా ప్రజలకు సేవచేయాలని కోరారు. ఏసురత్నం ఉద్యమస్ఫూర్తి, త్యాగనిరతి, పోరాటదీక్షలను దళిత నేతలు పిల్లి విద్యాసాగర్, వేము సమత, భీమిరెడ్డి శేషు, డాక్టర్ అబ్రహాం లింకన్, సేవాట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్, దాస్, అందే శ్యామ్ వివరించారు. ఏసురత్నం మార్గంలో పయనించి దళిత విముక్తి మార్గంలో పనిచేయటమే కర్తవ్యమన్నారు. ఆయన ఆశయాల్ని నెరవేర్చలన్నారు. జల్లి గంటయ్య, ఎం.ప్రభాకరరావు, పినపాటి రవికుమార్ పాల్గొన్నారు. తొలుత ఏసురత్నం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు.

గ్రామీణ వైద్యుల సమస్యలపై లోకేష్‌కు వినతి



గుంటూరు మెడికల్: గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తెలుగునాడు కమ్యూనిటీ పారా మెడిక్స్ అసోసియేషన్ రాష్ట్ర నేతలు మంత్రి నారా లోకేష్‌ను ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆర్ఎంపీలకు యువగళంలో ఇచ్చిన హామీని యూనియన్ నేతలు మంత్రి లోకేష్‌కు గుర్తు చేశారు. యువగళంలో మాట ఇచ్చిన ప్రకారం తక్షణమే వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు గ్రామీణ వైద్యుల సమస్యలపై నివేదిక అందజేయాలని మంత్రి లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తమపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. మంత్రి లోకేష్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రవిచంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ రసూల్, కోశాధికారి వెంకటరాజారావు తదితరులు ఉన్నారు.

'నేను బడికి పోతా' ర్యాలీ



మంచాల(చేబ్రోలు): పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు..బడిలో అంటూ ఉపాధ్యాయులు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో బుధవారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, విద్యార్థులతో గ్రామంలోని ప్రధాన రహదారుల్లో ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందజేస్తున్న వసతులు, సౌకర్యాలను ఎంఈవోలు రాయల సుబ్బారావు, ఏపీహెచ్ ప్రసాద్‌లు వివరించారు. ఈ సందర్భంగా ఇరువురు ఎంఈవోలు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించి బడి బయట పిల్లలు లేని ఆదర్శ గ్రామంగా నిలపాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్ : అంతర్జాతీయ అసంఘటిత కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని దుగ్గిరాల మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద స్కీమ్ వర్కర్లు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు జెట్టి బాలరాజు మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 44 లేబర్ కోడ్‌లను నాలుగు కోడ్‌లుగా మార్చారని తెలిపారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పంచాయతీ కార్మికులకు టెండర్ విధానాన్ని రద్దు చేసి, గ్రీన్ అంబాసిడర్లకు కనీస వేతనం అమలు చేయాలని వివరించారు. అనంతరం తహసీల్దార్ రవికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సెక్టార్ సభ్యులు విజయ, ఎమ్మెల్యే అమ్మ, ఆశ వర్కర్లు, సునీత, వెంకటేశ్వరమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే అతిసార దూరం

మంగళగిరి: డయేరియా(అతిసార) నియంత్రణపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ర్యాలీ చేపట్టినట్లు గణపతి నగర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష పేర్కొన్నారు. బుధవారం ఎంటీఎంసీ ఆధ్వర్యంలో అనుబంధ శాఖల అధికారులతో స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2024లో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నినాదాలతో నిర్వహించిన ర్యాలీ నగర ప్రజలను ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా పాల్గొన్న కమిషనర్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ డయేరియాపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. డయేరియా లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యం తీసుకోవాలని చెప్పారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇళ్ల నుంచి చెత్త సేకరణ, డ్రెయినేజీల పూడిక తీయడం, ఫాగింగ్ చేపట్టడం, దోమలు, కీటకాలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. నగర ప్రజలంతా తమ చుట్టు పక్కల ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చేసుకోవడంతో పాటు పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఓఆర్ఎస్, జింక్ వినియోగంపై ప్రజలలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి



శ్రీధర్‌బాబుకు జ్ఞాపిక బహూకరిస్తున్న విద్యార్థిని, పక్కన రామకృష్ణ ప్రభు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని మోటివేషనల్ ట్రైనర్ కె.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సంగడి గుంటలోని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో బుధవారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు సత్యంలో జీవించకుండా స్వప్నంలో జీవిస్తున్నారని, అనుభవంతో పెద్దలు చెప్పే విషయాలు రాళ్ల దెబ్బల వలే ఉంటాయన్నారు. అవి జీవితానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. భారత్ వికాస్ పరిషత్ గుంటూరు అధ్యక్షుడు చలమయ్య మాట్లాడుతూ ఎన్నో విజయవంతమైన కార్యక్రమాలను నిర్వహించిన భారత్ వికాస్ పరిషత్ 63 సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రేరణ తరగతులు నిర్వహించినట్టు తెలిపారు. కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు, ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు, భారత్ వికాస్ పరిషత్ కార్యదర్శి రాజశేఖర్, ఆర్థిక కార్యదర్శి కాళంగి శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, శేఖర్, కళాశాల సభ్యుడు సూర్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మలేరియా సిబ్బందికి సూచనలిస్తున్న బయాలజిస్ట్ మధుసూదన్‌రావు

నెహ్రూ నగర్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బయాలజిస్ట్ మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం పలు ప్రాంతాల్లో మలేరియా విభాగం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ ఎక్కువ కాలం నిల్వ ఉన్న నీటిలో పెరిగే దోమలు, క్రిముల ద్వారా ప్రబలుతాయన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నగరపాలక సంస్థ మలేరియా విభాగం ఆధ్వర్యంలో 22 శానిటరీ డివిజన్ల వారీగా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని వెల్లడించారు. మలేరియా విభాగ సిబ్బంది నగరంలోని ప్రతి ఇంటిని సర్వే చేసి, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో తోక పురుగుల నివారణ మందులను చల్లడం, ఖాళీ స్థలాల్లో ఉన్న నీటిలో గంబుషియా చేపలు, ఆయిల్ బాల్స్ వదులుతున్నట్లు వెల్లడించారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం వెహికల్ మౌంటెడ్, హ్యాండ్ ఆపరేటెడ్ మెషిన్ల ద్వారా ఫాగింగ్ చేస్తున్నారని మధుసూదన్‌రావు చెప్పారు. ఇప్పటికే నగరంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నియంత్రణ కోసం ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రే మాలాతియాన్ ఫాగింగ్ పూర్తి చేశారని ఆయన చెప్పారు. డెంగీ, మలేరియా కేసులు నమోదు అయిన ప్రాంతాల్లో స్పెషల్ యాక్టివిటీ చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలకు పలు జాగ్రత్తలను వివరించారు.

జీజీహెచ్ ఓపీ బ్లాక్‌లో మరో షెడ్డు నిర్మాణం



భూమిపూజ చేస్తున్న డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకే చోట ల్యాబ్ పరీక్ష ఫలితాలను అందించేందుకు రేకుల షెడ్డును నిర్మిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం జీజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగం వద్ద రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న రేకుల షెడ్డుకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ పరీక్షల ఫలితాల కోసం రోగుల సహాయకులు వేర్వేరు ప్రాంతాల్లో వేచి ఉంటున్నారని తెలిపారు. ఒకే చోట ల్యాబ్ పరీక్ష ఫలితాలు రోగుల సహాయకులకు వెంటనే అందించాలన్న సంకల్పంతో పాత ఓపీ వద్ద రేకుల షెడ్డును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతం లో రూ.18 లక్షలతో 11ఓపీ కేంద్రాలను రోగుల కోసం అందుబాటులో తీసుకొచ్చామని పేర్కొన్నారు. దీనివల్ల రోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చల్లని వాతావరణం లో ఓపీ స్లిప్పులను తీసుకుంటున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమం లో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ గంగమ్మ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఆక్రమణల పరిశీలన

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ప్రహరీకి ఆనుకుని సాగిస్తున్న అక్రమ వ్యాపారాల సముదాయాలను బుధవారం నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పరిశీలించారు. అక్కడ నెలకొన్న అపరిశుభ్రత వాతావరణాన్ని గుర్తించి, వ్యాపారాల వద్ద వ్యర్థ పదార్థాలు, మురుగు ప్రవహిస్తుండటం గమనించారు. మురుగు వాసనతో దుర్గంధ భరితంగా మారి ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని గుర్తించారు. ఎలుకలు ఆసుపత్రి లో వెళ్లేందుకు మార్గం సుగమం అయ్యే అవకాశాలు ఉన్నాయని గుర్తించి.. ఈ విషయాలన్నీ జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్తామని డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ బ్యాటరీల చోరీ



బ్యాటరీల చోరీతో ఖాళీగా బాక్సులు

పట్నంబజారు: ట్రాఫిక్ సిగ్నల్స్‌కు సంబంధించిన బ్యాటరీలను గుర్తుతెలియని దుండగులు అపహరించుకు పోయిన ఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. కొత్తపేట పోలీసుల వివరాల మేరకు.. హిందూ కళాశాల కూడలిలోని మూడు ట్రాఫిక్ సిగ్నల్స్‌కు సంబంధించి కొద్దిరోజుల క్రితం నూతన బ్యాటరీలను అమర్చారు. మూడు రోజుల వ్యవధిలోనే గుర్తుతెలియని దుండగులు సుమారు రూ. లక్ష విలువ చేసే ఆరు బ్యాటరీలను అపహరించుకు పోయారు. అయితే ఇదే ఘటన గత మూడు నెలల క్రితం చోటు చేసుకుంది. హిందూ కళాశాల కూడలిలో ఉన్న సీసీ కెమెరాలు సైతం పనిచేయకపోవడంతో ఎవరు అపహరించుకు పోయారనేది తెలియరాలేదు. గత మూడు నెలల క్రితం జరిగిన ఘటన తరువాత కూడా ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే మరోసారి బ్యాటరీల చోరి జరిగిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్‌కు సంబంధించి వాటిని ఏర్పాటు చేసిన కాంట్రాక్ట్ చైతన్య మీడియా సూపర్‌వైజర్ కోలూరి సురేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కూల్‌డ్రింక్స్ షాపులో చోరీ



తెనాలిరూరల్: తెనాలి శివాజీచౌక్‌లోని ఓ కూల్‌డ్రింక్స్ షాపులో చోరీ జరిగింది. దుకాణ తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లిన దుండగులు అక్కడి బీరువాలో ఉంచిన రూ.ఎనిమిది లక్షలు అపహరించుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని శివాజీ చౌక్‌లో శ్రీనివాసరావు కూల్‌డ్రింక్స్ షాపును నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి దుకాణాన్ని మూసివేసే సమయంలో తన వద్ద ఉన్న రూ. ఎనిమిది లక్షలను లోపలి బీరువాలో ఉంచి తాళాలు వేసి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా దుకాణానికి బయట వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి అందులో ఉంచిన నగదు అపహరణకు గురైందని తెలుసుకున్నాడు. వెంటనే సమాచారాన్ని వన్‌టౌన్ పోలీసులకు తెలుపగా ఎస్ఐ కరీముల్లా తన సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించింది. బీరువాలో ఉంచిన కొద్ది మొత్తం నగదును అక్కడే వదిలి వెళ్లడం, కేవలం రూ.ఎనిమిది లక్షలు తీసుకెళ్లడంతో తెలిసిన వారి పనే అయి ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.